జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం 14 అక్టోబర్ 2026 పేజీలు:11



## సాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని

### - రజక సంఘం ప్రతినిధులు

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో)**

అచ్చంపేట పట్టణంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ, అచ్చంపేట రజక సంఘం ఆధ్వర్యంలో సాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం రజక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ..

- మిగతా 2 లో



# భూ రీసర్వేలో జాప్యానికి చెక్ పెట్టండి!

**- ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**- లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు**

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

- మిగతా 2 లో

# కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు.. మహిళా ఉద్యోగినుల ఆటపాటల సందడి!

### - తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నాలుగో రోజు వేడుకలు



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళ వారం ఘనంగా నిర్వహించారు. నాలుగో రోజు వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు సంప్రదాయ బద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.

- మిగతా 2 లో

# మల్దకల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దేవరగట్టు వరకు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

### - భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి





**మల్దకల్ అక్టోబర్ 13 ప్రజా జ్యోతి ప్రతినిధి):**

గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల కేంద్రంలో ఉన్న ఆదిశిలా క్షేత్రం శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయం నుంచి దేవరగట్టు వరకు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు.

- మిగతా 2 లో

# మల్దకల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి దేవరగట్టు వరకు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,త్వరలో జరగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు దేవరగట్టుకు వెళ్లి స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో భక్తులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు దాసంగాలు సమర్పించేందుకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు మాట్లాడుతూ,ఎమ్మెల్యే సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ప్రహ్లాదరావు,జిల్లా సీనియర్ నాయకులు సత్యారెడ్డి,సీతారాంరెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామన్ గౌడ్,జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్,మాజీ ఎంపీపీ విజయ్,మాజీ వైస్ ఎంపీపీ వీరన్న,వైస్ చైర్మన్ విష్ణు,నాయకులు వెంకటన్న, శేషంపల్లి నర్సింహులు,పట్వారి అరవిందరావు,నరేందర్,మధు నాయక్, పరశురాముడు,తిమ్మరాజు,ఆర్యవైశ్య సంఘం నాయకులు మనసాని నాగరాజు, శ్రీనివాసులు,నాగరాజు,యువ నాయకులు ప్రవీణ్,తిమ్మప్పతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.



# భూ రీసర్వేలో జాప్యానికి చెక్ పెట్టండి!

మొదటిపేజీ తరువాయి

ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి, రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండలాల వారీగా రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. పనుల నిర్వహణ, ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యానికి గల కారణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

### జాప్యంపై అసంతృప్తి.. పనుల వేగవంతానికి ఆదేశాలు

చిన్నచింతకుంట, కోయిలకొండ, హన్వాద, జడ్చర్ల, మహబూబ్‌నగర్ రూరల్, మహబూబ్‌నగర్ అర్బన్, గండీడ్, మూసాపేట తదితర మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. జడ్చర్ల మండలంలోని ఖానాపూర్, అమ్మాపూర్, అడ్డాకల్ మండలంలోని హాజీపూర్, పొన్నకల్, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జమిస్తాపూర్, కోటకదిరతో పాటు మూసాపేట మండల పరిధిలో రీసర్వే పనులు ఆలస్యంగా సాగుతున్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో పనులు మందకొడిగా సాగడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి, పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

### గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన

రీసర్వే ప్రారంభించే ముందు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో రైతులకు, గ్రామ ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా సర్వే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం భూములకు సంబంధించిన సర్వేను సమగ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

### సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

లైసెన్స్ సర్వేయర్ల కొరత, రోవర్ల లభ్యతలో ఇబ్బందులు, ఇతర సాంకేతిక సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే సంబంధిత మండల ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. రోవర్లు అవసరమైన మండలాలు జిల్లా సర్వే కార్యాలయం నుంచి పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు.తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రీసర్వే పనుల పురోగతిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించి, నిర్ణీత గడువులోగా లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రీసర్వేకు నోడల్ అధికారిగా యాదగిరి

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరిని జిల్లా భూ రీసర్వే పనుల నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డి, తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని

మొదటిపేజీ తరువాయి



తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాలో అర్ధరాత్రి చాకలి ఐలమ్మ విగ్రహం విధ్వంసంలో బాధ్యులైన దుండగులపై కేసు నమోదు చేసి దుండగులను చట్టపరంగా శిక్షించాలని రజక సంఘం ప్రతినిధులు టీఆర్పి నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని వ్యాఖ్యానించారు. వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సోషనీయమని రజక సంఘం ప్రతినిధులు ఆరోపించారు. మళ్లీ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని రజక సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అచ్చంపేట నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్ బల్మూరు మండల అధ్యక్షుడు అమరేందర్ గౌడ్ అచ్చంపేట టౌన్ ప్రెసిడెంట్ నిరంజన్ అచ్చంపేట టౌన్ జనరల్ సెక్రెటరీ రమేష్ మైనార్టీ నాయకులు షరీఫ్ రజక సేవా సంఘం అశోక్, పర్వతాలు, లింగం, మల్లేష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు.. మహిళా ఉద్యోగినుల ఆటపాటల సందడి!

మొదటిపేజీ తరువాయి



జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, మిషన్ భగీరథ, యువజన, క్రీడల శాఖ, ఉద్యానవన శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ పండుగ ఉత్సాహాన్ని చాటుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళా ఉద్యోగినులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే మహిళా ఉద్యోగినులు పండుగ సందర్భంగా ఒకచోట చేరి సంప్రదాయాలను స్మరించుకుంటూ వేడుకల్లో భాగస్వాములయ్యారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ సంబరాలు కలెక్టరేట్‌లో పండుగ వాతావరణాన్ని నింపాయి.



# రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ట పాలు చేయడమే కాంగ్రెస్ నైజం..

**- ఓటమి భయంతోనే ఓటు చోరీ డ్రామాలు!**

**- ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్ దాడిఎన్నికల్లో వరుస ఓటములతో దేశ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ..**

ఆలంపూర్ అక్టోబర్ 13

(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

గద్వాల పట్టణంలోని మంగళ వారం డికె.బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజ నేయులు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఎస్. ఐ ఆర్. ప్రక్రియపై రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం వారి రాజకీయ దివాళా కొరకే నిదర్శనం అని అన్నారు.. అదేవిధంగా సుప్రీంకోర్టు తీర్పును కూడా గౌరవించరా? అని ఎస్. ఐ ఆర్ . ప్రక్రియ అంతా చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని మే 27, 2026 న సర్వోన్నత న్యాయస్థానం (రాబజూతీవవవ జశీబతీ) స్పష్టమైన తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టే ఈ ప్రక్రియ చెల్లుబాటు అవుతుందని చెప్పిన తర్వాత కూడా, కాంగ్రెస్ పార్టీ ఇంకా అబద్ధాలను ప్రచారం చేయడం అంటే న్యాయవ్యవస్థను సైతం అవమానించడమే అవుతుందని అన్నారు. అదేవిధంగా.కాంగ్రెస్ పార్టీకి ఒక రాష్ట్రంలో ఒక నీతి, ఢిల్లీలో ఒక నీతి ఉంటుందా? కేరళలో వారి సొంత హోంమంత్రే ఎస్ ఐ. ఆర్. ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు మరియు అక్రమ ఓటర్లను తొలగించడానికి వీలవుతుంది" అని అంగీకరించారు. అలాగే తెలంగాణ, కర్ణాటక, కేరళ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే వ్యవస్థ ద్వారా ఎన్నికలు జరిగితే ఒప్పుకుంటారు.. కానీ వారు ఓడిపోయే రాష్ట్రాల్లో మాత్రం ఎన్నికల సంఘంపై నిందలు వేస్తారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అని అన్నారు.. . అదేవిధంగా అక్రమ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎందుకు ఉలిక్కిపడుతోందని దేశ భద్రతకు ముప్పుగా మారిన అక్రమ చొరబాటుదారుల ఓట్లను, బోగస్ ఓట్లను తొలగించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఎందుకంటే ఆ బోగస్ ఓట్లే వారి రాజకీయాధారం. నిజమైన ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా, బూత్ లెవల్ అధికారులు (దీూా) నేరుగా ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్లు సేకరిస్తారని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇంత పారదర్శకమైన ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోవాలని చూస్తోంది అని ప్రశ్నించారు. అలాగే తెలంగాణలో ఈ ప్రక్రియను విజయవంతం కాకుండా చూసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు, ఎన్నికల సంఘానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు.. అదేవిధంగా దేశవ్యాప్తంగా 124 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సరు చట్టబద్ధ ప్రక్రియలో పాలుపంచుకుంటూ ఓటర్ల జాబితా శుద్ధీకరణను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. అన్నారు కావునఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించే ఈ మంచి ప్రక్రియను తప్పుబడుతూ, కాంగ్రెస్ నేతలు ఇది తప్పు ప్రక్రియ అని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు, ఇంటలెక్చువల్స్ అందరూ ఈ సరు ప్రక్రియ మంచిదేనని చెబుతుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం తమ అనవసర ఆలోచనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాబట్టి, కాంగ్రెస్ నేతలు వెంటనే తమ తప్పుడు ప్రచారాలను మానుకోవాలని, ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న ఈ మంచి ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు ఆపాలని అన్నారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్, రాష్ట్రమహిళా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా యువమోర్చ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిల మోర్చా అధ్యక్షురాలు సమత మధుగౌడ్ ,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మహిళా మోర్చా నాయకురాలు కుంటల మాధవి, భారతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు..

# ప్రార్థివదేహాలకు నివాళులర్పించిన బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి

**- బాసు హనుమంతు నాయుడు**

ఆలంపూర్ అక్టోబర్ 13 (జ్యోతి డివిజన్ ప్రతినిధి)





గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలం అల్లపాడు గ్రామంలో బిఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచు ప్రతాప్ అత్త తుమ్మలబావి లక్ష్మీ మరియు గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఆలూరు ప్రకాష్ గౌడ్ తండ్రి ఆలూరు తిమ్మప్ప గౌడ్ మరియు గద్వాల పట్టణంలోని కుంటవీధి కాలనీలో టీచర్ కుంటల కామాక్షి అనారోగ్యములతో మృతి చెందారు విషయం తెలుసుకొని వారి స్వగృహాలకి వెళ్లి, వారి ప్రార్థివదేహాలకు పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు..వీరి వెంట,రాజారెడ్డి,సర్పంచు సౌరప్ప, శ్రీనివాస్ గౌడ్,సి.కె.రంగన్న,చక్రిధర్ రెడ్డి,నరసప్ప, వెంకటేష్ నాయుడు, సోమశేఖర్ రెడ్డి,కుంట సాలన్న, జాంపల్లి భరత్ సింహారెడ్డి, సిద్ది భాయ్ కిష్టన్న,కురవ లచ్చన్న,నాగరాజు,తిమ్మప్ప, రాము,రాముడు, మల్లికార్జున్, నరసింహులు,గోవిందు, వీరేష్ మరియు నాయకులు తదితరులు ఉన్నారు.....

# సాగునీటి కోసం బీఆర్ఎస్ ధర్నా నేడే చిన్నంబావిలో ఆందోళన

చిన్నంబావి, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి)

మండలంలోని ఎండుతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడే ఉదయం 10 గంటలకు చిన్నంబావి మండల కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని బీఆర్ఎస్ నాయకులు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.



# శరన్నవరాత్రుల్లో ధనలక్ష్మి, ధరణి మాత అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

- జమ్ములమ్మ ఆలయంలో రూ.9.99 లక్షలతో ధనలక్ష్మి అలంకారం..

పిల్లిగుండ్లలో భూమాతగా శివకామేశ్వరి దేవి





అలంపూర్ అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మూడవ రోజు మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జమ్మిచేడు గ్రామంలో స్వయంభువుగా వెలసిన జమ్ములమ్మ అమ్మవారు ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.9 లక్షల 99 వేల రూపాయలతో విశేషంగా అలంకరించారు. అలాగే గద్వాల పట్టణంలోని ఏడో వార్డు హనుమాన్ కాలనీ, పిల్లిగుండ్ల ప్రాంతంలోని ముదుపుల ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువైన శివకామేశ్వరి దేవి ధరణి మాత (భూమాత) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

**(ధనలక్ష్మి దేవి అలంకారం ప్రత్యేకత:-)**

ధనలక్ష్మి దేవి అష్టలక్ష్ముల్లో ఒకరు. సంపద, ఐశ్వర్యం, శ్రేయస్సుకు ప్రతీకగా భక్తులు ధనలక్ష్మిని ఆరాధిస్తారు. సంపద అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు.. కుటుంబ సంతోషం, ఆరోగ్యం, ఆహారం, విద్య, మంచి జీవితం కూడా సంపదలో భాగమేనని ఈ అలంకారం తెలియజేస్తుంది. కష్టపడి పనిచేసే శక్తి, సంపాదించిన సంపదను సద్వినియోగం చేసే వివేకం, అవసరంలో ఉన్నవారికి సాయం చేసే దాతృత్వం కలగాలని భక్తులు ధనలక్ష్మి దేవిని ప్రార్థిస్తారు. జమ్మిచేడు జమ్ములమ్మ అమ్మవారు రూ.9.99 లక్షలతో ధనలక్ష్మి అలంకారంలో దర్శనమివ్వడం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని భక్తులు కోరుకున్నారు.

**(ధరణి మాత అలంకారం సందేశం:-)**

ధరణి మాత అంటే భూమాత. మనుషులు, జంతువులు, పక్షులు, చెట్లు, పంటలు సహా సమస్త జీవరాశికి భూమి ఆధారం. మనకు ఆహారాన్ని అందించే పంటలు, తాగునీటికి ఆధారమైన జలవనరులు, జీవించడానికి అవసరమైన ప్రకృతి సంపద భూమి ద్వారానే లభిస్తాయి. అందుకే భూమిని తల్లిగా భావించి పూజిస్తారు. భూమాత అలంకారం ప్రకృతిని గౌరవించాలని, పర్యావరణాన్ని కాపాడాలని, నీటిని వృథా చేయకూడదని, చెట్లను పెంచాలని, భూమిని కాలుష్యం నుంచి రక్షించాలని సందేశమిస్తుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ప్రకృతి పట్ల బాధ్యతగా మెలగాలని ఈ రూపం తెలియజేస్తుంది అదేవిధంగా.శరన్నవరాత్రుల్లో అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో రూపంలో దర్శనమిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తారు. ధనలక్ష్మి రూపం సంపదను సద్వినియోగం చేసుకోవడం, ధరణి మాత రూపం ప్రకృతిని కాపాడుకోవడం వంటి విలువలను గుర్తుచేస్తాయి. అమ్మవార్ల దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతూ నవరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు.

# ఎం.జి సైకిల్ స్టోర్ యజమాని మహమ్మద్ గౌస్ మృతి

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి)



నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఎం.జి సైకిల్ స్టోర్ యజమాని మహమ్మద్ గౌస్(72) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతు మంగళవారం తుదిశ్వాస వదిలారు.వ్యాపార రంగంలో అంచలంచెలుగా ఎదుగుతూ మంచి పేరును సంపాదించుకున్న గౌస్ కు ముస్లిం మైనారిటీ సంఘాలు, జర్నల్ మర్చంట్ అసోసియేషన్ బాధ్యులు మహమ్మద్ గౌస్ మృతి పట్ల ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు.

# ఎస్ఐ,కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

- అర్హులైన ఎస్సీ,ఎస్టీ డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి
- అక్టోబర్ 14 వరకు దరఖాస్తుల స్వీకారణ
- షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి)



పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఎస్ఐ,పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో దరఖాస్తుచేసుకున్న ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన డిగ్రీ ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్ 20వ,తేదీ వరకు ఉచిత వసతితో కూడిన శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఆఫ్ లై న్ విధానంలో అందజేయాలని అన్నారు.ఇతర వివరాల కోసం 8977340006-8500334470 ,8309657774 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# మల్దకల్‌లో శ్రీ అన్నపూర్ణాదేవిగా వాసవి మాత దర్శనం



## - ప్రత్యేక పూజలు, హోమం..కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

**మల్దకల్ అక్టోబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్దకల్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మూడో రోజు వాసవి మాతను శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హోమం నిర్వహించగా,వేద పండితులు చైతన్య వేదమంత్రాలతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం రవి ఆచారి,ప్రద్యుమ్న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ,పూజా కార్యక్రమాలను నిర్వహించారు.సకల ప్రాణికోటికి జీవనాధారం అన్నం.అందుకే అన్నాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తారు.భక్తులకు అన్నాన్ని ప్రసాదించే తల్లిగా శ్రీ అన్నపూర్ణాదేవి పూజలందుకుంటారు.ఈ అమ్మవారిని ఆరాధించడం వల్ల మేధాశక్తి,బుద్ధి,జ్ఞానం,వాక్చాతుర్యం,సమయస్ఫూర్తి,ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం.అమ్మవారి చేతిలోని రసపాత్ర అక్షయ శుభాలకు ప్రతీకగా నిలుస్తుంది.సకల జీవరాశిని పోషించే జగన్మాతగా ఈ అవతారం భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది.సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు.ఆర్యవైశ్య సంఘం నాయకులు,ప్రతినిధులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరించారు.ఈ రోజు పూజా కార్యక్రమాలకు మల్దకల్‌కు చెందిన గణేకల్ వీరేష్ అండ్ సన్స్,ఆరగిద్దకు చెందిన చిందుకూరి సోమశేఖర్ అండ్ సన్,చిందుకూరి రాఘవేంద్ర అండ్ సన్,ఉలిగేపల్లికి చెందిన ఆళ్లగడ్డ ప్రకాష్ అండ్ సన్స్,పార్చర్లకు చెందిన చవ్వా రాములు అండ్ బ్రదర్స్ పూజా దాతలుగా వ్యవహరించారు.కార్యక్రమం అనంతరం పూజా దాతలను ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా కావలి మహేష్



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం వీపనగండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల నారాయణ రెడ్డి వీపనగండ్ల గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్ ఇంట్లో వీపనగండ్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా కావలి మహేష్ ను ఎన్నుకోబడిందని స్థానిక సర్పంచ్ మీసాల పార్వతమ్మ అన్నారు. గౌరవ అధ్యక్షులు పోతుల వెంకటరెడ్డి గౌరవ సలహాదారుడు ఎర్ర రాముడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి మహేష్ ఉపాధ్యక్షులు కమ్మరి మురళి భాను ప్రకాష్ గడ్డమీద ఎల్లయ్య, వడ్డే ఆంజనేయులు ప్రధాన కార్యదర్శి క్యాతం కురుమయ్య, మీసాల నాగన్న, తప్పేట స్వాములు, మంగదొడ్డి ఎల్లయ్య సహాయ కార్యదర్శి రాచూరి రాజశేఖర్, మాల కురుమయ్య, మానపాడు కురుమయ్య, లోకా రెడ్డి ను కమిటీని ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు అరుణ్ బాబు ఆదేశాలతో గ్రామంలో అన్ని వర్గాలకు కులమతాలకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు అందజేస్తానని అన్నారు కార్యక్రమంలో మాజి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాము రాజశేఖర్ పెద్ద వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతల వెంకట్ రెడ్డి క్యాతం కురుమయ్య బాలు యాదవ్, శివ యాదవ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మల్దకల్ భక్త మార్కండేయ దేవస్థానంలో అన్నపూర్ణేశ్వరి గా అమ్మవారి దర్శనం

## - శరన్నవరాత్రుల మూడవ రోజు ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు,సాంస్కృతిక కార్యక్రమాలు

**మల్దకల్ అక్టోబర్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):**




జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవ స్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారిని ఆకుపచ్చ రంగు చీరతో అలంకరించి,వివిధ రకాల పుష్పాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళల ఆధ్వర్యంలో కుంకు మార్చనలు ,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలకు దాత లుగా దామ మహాలక్ష్మి, నాగ రాజు దంపతులు వ్యవహరిం చారు. ఆలయ ప్రధాన అర్చ కులు శ్రవణ్ కుమార్,ఆలయ మహిళా అర్చకురాలు సురేఖ పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.ఈ ఉత్సవాల్లో పద్మశాలి కుల బాంధవులు, మహిళలు,బాలికలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సహకారంతో శరన్నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆలయ అధ్యక్షులు,కమిటీ సభ్యులు తెలిపారు.

# కనకదుర్గ మాత అమ్మవారిని దర్శించుకున్న నర్వ మండల కాంగ్రెస్ నాయకులు

**నర్వ అక్టోబర్ 13 ప్రజా జ్యోతి**



నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం: నర్వ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ కనకదుర్గ మాత అమ్మవారిని నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నర్వ మండలం సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల తాహసిల్దార్ మల్లారెడ్డి గారు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, ఏఎంసీ వైస్ చైర్మన్ డి. కృష్ణారెడ్డి, మండల డిప్యూటీ తాసిల్దార్ జగన్ , సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం,నర్వ గ్రామ సర్పంచ్ టి. హనుమంత్ రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ సంతోష్,మండల నాయకులు బీసం రామకృష్ణ, పి. పరశురాం, వెంకట్రాంరెడ్డి, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి. అశోక్ గౌడ్, నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దల ఆంజనేయ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు..

# మాగనూరు ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: అధ్యక్షుడు సురేష్

**మాగనూరు, అక్టోబర్ 13(ప్రజా జ్యోతి)**



మాగనూరు మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుంజనూరు సురేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్దాస్ కథలప్ప, ఉపాధ్యక్షులుగా గొల్ల నరేష్, కె. శివకుమార్, కోశాధికారిగా బాల్దాస్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా జి. ప్రహ్లాద్ రెడ్డి, సగరం లక్ష్మణ్ ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా రాజు, రమేష్ గౌడ్, రాము, శేఖర్ గౌడ్, అశోక్, రాజు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విలేకరుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జర్నలిస్టు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపార.

# అన్నపూర్ణేశ్వరి అవతారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు. భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు

**పెబ్బేరు అక్టోబర్13 ప్రజాజ్యోతి**

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరి మాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించి మహామంగళహారతి సమర్పించారు. అనంతరం అన్నపూర్ణేశ్వరి మాతగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సకల జీవరాశులకు అన్నాన్ని ప్రసాదించే జగన్మాత అన్నపూర్ణేశ్వరి దేవి అని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే అన్నపానాదులకు లోటు లేకుండా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం మహిళలు, పురుషులు, యువతీ యువకులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల పూజలు, అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



# దేశ నిర్మాణానికి వ్యక్తి నిర్మాణమే పునాది

## - దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావమే ఆర్ఎస్ఎస్ ఆశయం

## - గండీడ్‌లో మూడు రోజులపాటు కోస్గి ఖండ్ ప్రారంభిక్ వర్గ విజయవంతం

**గండీడ్, (ప్రజాజ్యోతి):**

దేశభక్తి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కోస్గి ఖండ్ ప్రారంభిక్ వర్గ మూడు రోజులపాటు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. గండీడ్ మండల కేంద్రంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో గండీడ్, కదిరేగూడెం, కోస్గి, గుండుమాల్ మండలాలకు చెందిన స్వయంసేవకులు పాల్గొన్నారు.వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణానికి పునాదిమూడు రోజులపాటు నిర్వహించిన ఈ ప్రారంభిక్ వర్గలో స్వయంసేవకులకు శారీరక, మానసిక వికాసానికి సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ అందించారు. శారీరక వ్యాయామాలు, క్రమశిక్షణ, సమయపాలన, సంఘటిత శక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల ప్రాధాన్యతను వివరించారు. వ్యక్తిలో మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందినప్పుడే సమాజానికి, దేశానికి మేలు చేసే వ్యక్తులు తయారవుతారని శిక్షణ ద్వారా తెలియజేశారు.వందేళ్ల ప్రస్థానంలో ఆర్ఎస్ఎస్ ఎన్నో మైలురాళ్లుఈ సందర్భంగా వర్గ కార్యవాహ్ చాపల శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నో సవాళ్లు, ఆటుపోట్లను ఎదుర్కొంటూ సంఘం తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందని, దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు విదేశాల్లోనూ భారతీయ సమాజానికి సంబంధించిన పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఆర్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశం వ్యక్తి నిర్మాణం ద్వారా సమాజ నిర్మాణానికి కృషి చేయడమేనని వివరించారు. స్వయంసేవకుల్లో క్రమశిక్షణ, శీలం, సమయపాలన, సంఘటిత శక్తి, సామాజిక బాధ్యత వంటి లక్షణాలను పెంపొందించడంలో శాఖలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతిరోజూ ఒక గంట శాఖతో వ్యక్తిత్వ వికాసంప్రతిరోజూ ఒక గంటపాటు శాఖలో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని చాపల శ్రీనివాసులు పేర్కొన్నారు. నిత్యజీవితంలో సమయపాలన పాటిస్తూ మంచి





నడవడికను అలవర్చుకోవాలని, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.సమాజం కోసం, దేశం కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే సేవాభావాన్ని ప్రతి స్వయంసేవకుడు అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తులు, సామాజిక అవసరాలు, ప్రజలకు సహాయం అవసరమైన సందర్భాల్లో స్వయంసేవకులు ముందుండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, సోదరభావం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.శిక్షణ కార్యక్రమంలో పలువురు స్వయంసేవకులుఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార ప్రముఖ్ స్వయం ప్రకాష్, ఖండ్ కార్యవాహ్ యాదయ్య, బాలకృష్ణ గౌడ్, ఖండ్ ధర్మ జాగరణ ప్రచార ప్రముఖ్ అనేమోని కృష్ణయ్య, బాలకృష్ణ, గాజుల రాములు, కృష్ణ, మధు గౌడ్, మహిపాల్ గౌడ్, కుమ్మరి శ్రీనివాస్, రాంబాబు, శ్రీనివాస్, డబ్బుల శ్రీనివాస్ రెడ్డి తదితర స్వయంసేవకులు పాల్గొన్నారు.

# ఆహార వ్యాపారులకు శుభవార్త.. కలెక్టరేట్‌లో ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్ మేళా!

- హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాల నిర్వాహకులు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులకు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ప్రత్యేక లైసెన్స్ మేళా నిర్వహించనున్నారు. అక్టోబర్ 14న ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత వెల్లడించారు. ఆహార వ్యాపారాలకు అవసరమైన లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహకారం అందించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

**ఎక్కడ నిర్వహిస్తారు?**

మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తు, గది నంబర్ 218లో ఉన్న గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మేళా నిర్వహించనున్నారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, ఆహార పదార్థాల తయారీదారులు, విక్రయదారులు, ఇతర ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీలత సూచించారు. ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ అవసరమైన వ్యాపార నిర్వాహకులు మేళాకు హాజరై, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, ఇతర నిబంధనలపై వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.ఆహార భద్రతా నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు నిర్వహించేందుకు, లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ ప్రక్రియపై స్పష్టత పొందేందుకు ఈ మేళా ఉపయోగపడనుంది. సంబంధిత వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు మూసివేత

- అర్హతకు మించి వైద్యం.. యాంటీబయోటిక్ ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్ వినియోగంపై అధికారుల తనిఖీలు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**





ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన ఫస్ట్ ఎయిడ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా అర్హతకు మించి వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఐదు కేంద్రాలను మూసివేశారు. రోగులకు యాంటీ బయోటిక్ ఇంజక్షన్లు ఇవ్వడం, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, నెబ్యులైజర్ వినియోగించడం వంటి సేవలు అందిస్తున్నట్లు గుర్తించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ. శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఐదు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను మూసివేసినట్లు ఆయన తెలిపారు. మిడ్జిల్ మండల కేంద్రంలో ఒకటితో పాటు బోయినిపల్లిలో ఒకటి, కొత్తపల్లిలో ఒకటి, బాలానగర్ మండలం హేమాజీపూర్‌లో ఒకటి, నవాబుపేట మండలం కాకర్లపహాడ్‌లో ఒకటి ఉన్నాయి. మొత్తం ఐదు కేంద్రాలపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి**

ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు తమ పరిధిలోని ప్రథమ చికిత్స సేవలకే పరిమితం కావాలని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. తగిన అర్హతలు, అనుమతులు లేకుండా అధునాతన వైద్య సేవలు అందించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించి వైద్య సేవలు అందించే కేంద్రాలపై తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

**ప్రజల ఆరోగ్యమే ముఖ్యం**

ప్రజలకు వైద్య సేవలు అందించే కేంద్రాలు నిర్దేశిత నిబంధనలు పాటించడం అత్యంత ముఖ్యమని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సరైన వైద్య సేవలు అందేలా చూడటంతో పాటు, అవసరమైనప్పుడు అర్హత కలిగిన వైద్యుల వద్దకు పంపించే బాధ్యత కూడా ప్రథమ చికిత్స కేంద్రాల నిర్వాహకులపై ఉంటుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు (డీఎల్ఓ), నోడల్ అధికారి డాక్టర్ శివకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి జి. నర్సింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# పగిడాల్‌లో అన్నపూర్ణాదేవిగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు

కూరగాయలు, పండ్లతో అమ్మవారికి అలంకరణ..

భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం

**గండీడ్, (ప్రజా జ్యోతి):**

గండీడ్ మండల పరిధిలోని పగిడాల్ గ్రామంలో దుర్గామాత ప్రతిష్ఠాపన సందర్భంగా మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.అన్నపూర్ణాదేవి అనుగ్రహంతో ప్రజ లందరికీ సుఖసంతోషాలు కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సిరిసంపదలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి పూజా కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు భక్తితో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో పగిడాల్ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# తిమ్మారెడ్డిపల్లి తండాలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం

## క్రీడలతో యువతలో ఐక్యత, క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతాయి

**ఉట్కూర్ అక్టోబర్ 13 (ప్రజాజ్యోతి)**

ఊట్కూర్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండాలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన నాయకులు క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, క్రీడలు యువత అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు: సూర్య ప్రకాశ్ రెడ్డి ఊట్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ తిమ్మారెడ్డిపల్లి తండా సర్పంచ్ రాములు నిడుగుర్తి సర్పంచ్ కోరం మహేష్ రెడ్డి యూత్ కాంగ్రెస్ ఊట్కూర్ మండల అధ్యక్షులు కృష్ణార్జున రెడ్డి మధు రెడ్డి ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. యువతకు క్రీడలే స్ఫూర్తి క్రీడాకారుల విజయమే మనందరికీ గర్వకారణం, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న ప్రతి జట్టుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం కోరం మహేష్ రెడ్డి యూత్ కాంగ్రెస్ ఊట్కూర్ మండల అధ్యక్షులు.



# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ..!

- పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి:

కలెక్టర్ ఖుష్బూ గుప్తా మహబూబ్‌నగర్‌లో బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రత్యేకతను ప్రతిబింబిస్తుందని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ బతుకమ్మ పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల జీవన విధానం, ప్రకృతితో ముడిపడిన సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో పండుగను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు చాటిచెప్పేలా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, టీజీవో జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి బైకాని బాలు యాదవ్, అసోసియేట్ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు తానాజీ, జాయింట్ సెక్రటరీ నరేష్, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# భూ సరిహద్దుల వివాదాలకు చెక్ పెట్టనున్న రీసర్వే!

- ఆధునిక రోవర్ సాంకేతికతతో భూముల కొలతలు.. భూ యజమానులకు ఎల్‌పీఎం మ్యాపులు
- చీకర్లపల్లిలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ హరిప్రియ

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

భూముల సరిహద్దులను కచ్చితంగా గుర్తించి, భవిష్యత్తులో తలెత్తే భూ వివాదాలను నివారించేందుకు రీసర్వే కార్యక్రమం దోహద పడుతుందని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అన్నారు. ఆధునిక సాంకేతికతతో భూముల కొలతలు చేపట్టి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించేందుకు ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని వివరించారు. హన్వాడ మండలం చీకర్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను మంగళవారం శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివానితో కలిసి అదనపు కలెక్టర్ హరిప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, హన్వాడ తహసీల్దార్ పాల్గొన్నారు.

**రోవర్ సాంకేతికతతో కచ్చితమైన కొలతలు:**

గ్రామంలో రీసర్వే పనుల పురోగతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ స్థానిక రైతులు, గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూముల కొలతల్లో కచ్చితత్వం కోసం ఆధునిక రోవర్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

**భూ యజమానులకు ఎల్‌పీఎం మ్యాపులు:**

రీసర్వే పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు ల్యాండ్ పార్సెల్ మ్యాప్స్ (ఎల్‌పీఎంలు) అందజేస్తామని అదనపు



కలెక్టర్ వెల్లడించారు. ఈ మ్యాపుల ద్వారా భూముల విస్తీర్ణం, సరిహద్దుల గుర్తింపునకు స్పష్టత లభిస్తుందని వివరించారు. భవిష్యత్తులో భూ సరిహద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించిన వివాదాలను నివారించేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు.

**రైతుల సహకారం కీలకం:**

రీసర్వే కార్యక్రమాన్ని సజావుగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు గ్రామస్థులు, రైతులు అధికారులకు సహకరించాలని హరిప్రియ విజ్ఞప్తి చేశారు. సర్వే సమయంలో భూములకు సంబంధించిన వివరాలను అందిస్తూ, ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని సూచించారు. భూముల సరిహద్దులపై స్పష్టత, రికార్డుల్లో కచ్చితత్వం, భవిష్యత్తులో వివాదాల నివారణ లక్ష్యంగా రీసర్వే కార్యక్రమాన్ని అధికారులు ముందుకు తీసుకెళ్తున్నారు.

# కొంకల గ్రామ దేవాలయ భూముల పరిరక్షణకు వినతి పత్రం అందజేత

- వడ్డేపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ గౌడ్
- గ్రామ సర్పంచ్ జ్యోతి వరదరాజు , ఉప సర్పంచ్ సంజీవ్
- కొంకల గ్రామ పెద్దలు, ప్రజలు

**ఆలంపూర్ అక్టోబర్ 13(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండలం కొంకల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 358లో ఉన్న 08 ఎకరాల 07 గుంటల ఈశ్వరస్వామి దేవాలయానికి చెందిన దేవదాయ భూముల పరిరక్షణ కోసం వడ్డేపల్లి మండల తహశీల్దార్ కి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే కొంకల గ్రామ సర్వే నంబర్ 358లోని 08 ఎకరాల 07 గుంటల ఈశ్వరస్వామి దేవాలయ దేవదాయ భూమికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఓ.ఆర్.సి. ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, కొంకల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 358లో ఉన్న 08 ఎకరాల 07 గుంటల భూమి పురాతన కాలం నుంచి ఈశ్వరస్వామి దేవాలయానికి చెందిన దేవదాయ భూమిగా ఉన్నట్లు తెలిపారు. సదరు భూమికి సంబంధించి ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ జారీకి సంబంధించిన ప్రతిపాదనలు వడ్డేపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భూమికి సంబంధించిన రెవెన్యూ, దేవదాయ శాఖ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, దేవాలయ భూముల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



దేవాలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సంబంధిత రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఓ.ఆర్.సి. ప్రతిపాదనలపై తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన ఉత్తర్వులు జారీ చేసి దేవాలయ భూములను పరిరక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో :రవిప్రకాష్ రెడ్డి, సూర్యప్రతాప్ రెడ్డి, వడ్డే హనుమంత్, మస్కె నాగేష్, వడ్డే కిష్టప్ప, తెలుగు రాముడు, మస్కె శరువన్న తదితరులు, కొంకల గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు క్రాప్ హాలిడే.. ప్రభుత్వానికి పాలన హాలిడేనా.?

## - పంటలు ఎండుతున్నా పట్టింపు లేదు.. ప్రజలు నీళ్ల కోసం రోడ్డెక్కుతున్నా స్పందన లేదు!

## - మంత్రులంతా ఢిల్లీలో మకాం..

## రాష్ట్రంలో సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**తెలంగాణ భవన్ / మహబూబ్ నగర్ అక్టోబర్ 13**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రాష్ట్రంలో రైతులు సాగునీరు లేక పంటలు కళ్లముందే ఎండిపోతుంటే, గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ధర్నాలు చేసే పరిస్థితి నెలకొంటే, ఉద్యోగులు వైద్యం అందక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన ప్రభుత్వం ఎల్‌నినోను సాకుగా చూపుతూ క్రాప్ హాలిడే ప్రకటించి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి మంత్రులు ఢిల్లీలో మకాం వేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, తాగునీరు, వైద్యం, విద్య, ఉద్యోగ రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఏం కావాలి? రాష్ట్రంలో ఏం జరుగుతోంది? రైతులు ఎలా బతకాలి? అనే అంశాలపై ప్రభుత్వానికి కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు.

**క్రాప్ హాలిడే పరిష్కారమా.. రైతుల బతుకులకు భరోసా ఏదీ.?**

రైతులు పంటలు సాగు చేసుకోవద్దని చెప్పడం సమస్యకు పరిష్కారం కాదని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రెండో పంట సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం, పంటలు వేయలేని రైతుల కుటుంబాలు ఎలా జీవించాలో కూడా చెప్పాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని, రెండో పంట సాగు చేయలేని రైతులకు ఆర్థిక సహాయం కల్పించాలని కోరారు. రైతులపైనే ఆధారపడి జీవించే వ్యవసాయ కూలీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు.రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించడం సులభమే.. కానీ వారి కుటుంబాల ఆకలి తీర్చే బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

**నీళ్లు దిగువకు.. రైతుల పొలాలకు మాత్రం కరువు.!**

కృష్ణా నది నుంచి భారీగా నీరు దిగువకు వెళ్లినా, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా నిల్వ చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, సుమారు 350 టీఎంసీల నీరు దిగువకు వెళ్లినప్పటికీ కనీసం 30 టీఎంసీల నీటిని కూడా నిల్వ చేసుకోలేకపోయారని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ 185 టీఎంసీల నుంచి 70 టీఎంసీలకు పడిపోయిందని, సుమారు 60 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లను ఆన్ చేయడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆల్మట్టి డ్యామ్‌లో 132 టీఎంసీలు, నారాయణపూర్ డ్యామ్‌లో 33 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలు నీటిని ఒడిసిపట్టుకుంటుంటే తెలంగాణలో మాత్రం నీటి నిర్వహణపై ముందస్తు ప్రణాళిక కొరవడిందని విమర్శించారు.ఎల్‌నినో ప్రభావం ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నప్పుడు, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి తెలంగాణలో నీటి లభ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**తాగునీటి కోసం ధర్నాలు.. ఇదేనా ప్రజాపాలన.?**

రాష్ట్రంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని, ప్రజలు నీటి కోసం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ప్రజలకు కనీస తాగునీటిని అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేసవికాలం లేదా వర్షాభావ పరిస్థితులు వచ్చినప్పుడు ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి, ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. నీటి కోసం ప్రజలు ధర్నాలు చేయాల్సి వస్తుంటే.. ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక ఎక్కడ పోయిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు.



**హెల్త్ కార్డులున్నా వైద్యం అందదా.?**

ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆసుపత్రుల్లో వైద్యం పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు పనిచేయకపోవడం, ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల వైద్య సేవలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు.ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం తక్షణమే సమావేశం నిర్వహించి, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వైద్యం అందక ఎవరూ ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని, ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. రేయింబవళ్లు విధులు నిర్వహించే పోలీసులతో పాటు హోంగార్డులకు కూడా సమగ్ర ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి నిరుద్యోగుల వరకు..**

**అన్నిచోట్లా ఆందోళనలే.!**

రాష్ట్రంలో విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆందోళనలు చేస్తున్నారని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ అమలులో జాప్యంపై నిరుద్యోగులు ఉద్యమిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సైతం సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి శాఖకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తే సమస్యలను చాలావరకు పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. విద్యుత్ శాఖ మంత్రి విద్యుత్ సరఫరాపై, వ్యవసాయ శాఖ మంత్రి సాగునీరు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీ సంచుల లభ్యతపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి శాఖ మంత్రి తన శాఖపై పట్టు సాధించి, ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

**ధరల మంటతో సామాన్యుడి బతుకు బుగ్గి.!**

పప్పు, ఉప్పు, నూనె వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పెరుగుతున్న ధరల నియంత్రణకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల నుంచి సామాన్యుల వరకు అందరూ ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు.

**భూములు, పైరవీలపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదా.?**

ప్రజా సమస్యల పరిష్కారం కంటే భూములు, పైరవీలు, ఇతర వ్యవహారాలపైనే మంత్రులు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వంటి అంశాల్లో పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా చూడాలని అన్నారు.రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు అత్యవసర పరిస్థితులను తలపిస్తున్నాయని వ్యాఖ్యానిస్తూ, ప్రభుత్వం ఇప్పటికైనా పరిపాలనపై దృష్టి సారించి ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వం ముందున్న ప్రశ్నలివే.!**

రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకున్న చర్యలేమిటి? పంటలు సాగు చేయలేని రైతులకు ఎంత నష్టపరిహారం అందిస్తారు? తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి కార్యాచరణ చేపట్టారు? ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ కార్డుల ద్వారా వైద్యం అందేలా ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం ఎప్పుడు స్పష్టత ఇస్తుంది.? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించి, ప్రజల సమస్యలను గాలికి వదిలేయడం పాలనకు ప్రత్యామ్నాయం కాదని ఆయన విమర్శించారు. ప్రకటనలతో కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలతో ప్రజలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**- బీసీ సమాజ ఆత్మగౌరవంపై దాడి చేయడమే - జాతీయ బీసీ జనసేన ఉమ్మడి**

**మహబూబ్‌నగర్ - జిల్లా అధ్యక్షుడు ఎల్పటి రాజ్‌కుమార్ డిమాండ్**



**(ప్రజా జ్యోతి):**

తెలంగాణ వీరనారి, మహిళా ధైర్యానికి ప్రతీక, భూమి కోసం.. భుక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని జాతీయ బీసీ జనసేన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎల్పటి రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వెల్కమ్ బోర్డు, ఆటోనగర్ ప్రాంతంలో అక్టోబర్ 13వ తేదీ తెల్లవారుజామున చాకలి ఐలమ్మ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు.బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సహించం చాకలి ఐలమ్మ విగ్రహంపై దాడి చేయడం యావత్ బీసీ సమాజ ఆత్మగౌరవంపై దాడి చేయడమేనని ఎల్పటి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు.సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య విలువలకు, సమాజ శాంతికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి ప్రభుత్వం, పోలీసు అధికారులు వెంటనే స్పందించి విగ్రహ ధ్వంసానికి పాల్పడిన నిందితులను గుర్తించి, సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఎల్పటి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. విగ్రహానికి తగిన రక్షణ కల్పించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా మహనీయుల విగ్రహాల పరిరక్షణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరారు.చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని అవమానించే విధంగా వ్యవహరించే వారిని చట్టం ముందు నిలబెట్టాలని, బీసీ సమాజ ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. నిందితులకు శిక్ష పడే వరకు న్యాయపోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.వీరనారి ఆశయాలను కాపాడుకోవాలిచాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎల్పటి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలను గౌరవించడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బీసీ సమాజ ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

---

# భూసేకరణలో జాప్యం వద్దు.. పెండింగ్ దరఖాస్తులకు త్వరగా పరిష్కారం!

## - జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, సాగునీటి ప్రాజెక్టుల పనులకు వేగం పెంచాలి

## - రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. భూ భారతి, మీ సేవ ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని స్పష్టం చేశారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ ప్రాజెక్టుల భూసేకరణ, రెవెన్యూ సేవల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.





**భారత్‌మాల భూసేకరణపై ప్రత్యేక దృష్టి:**

భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, భూముల స్వాధీన ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. భూముల స్వాధీనానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేయడంతోపాటు, గుర్తించాల్సిన లబ్ధిదారులు, అందుబాటులో లేని భూయజమానుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. పెండింగ్ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తదుపరి సమీక్ష సమావేశం నాటికి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**రైల్వే, సాగునీటి ప్రాజెక్టులకు భూములు త్వరగా సేకరించాలి:**

రైల్వే లైన్ల డబ్లింగ్‌కు అవసరమైన భూముల సేకరణలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూసేకరణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు.కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా, లక్ష్మీదేవిపల్లి తదితర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**60 రోజులు దాటిన దరఖాస్తులపై సమీక్ష**

భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న కేసులు, 60 రోజులకు మించి పరిష్కారం కాని దరఖాస్తుల స్థితిగతులను కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీల పరిష్కార పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, దరఖాస్తుదారులకు ఎలాంటి జాప్యం లేకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

**మీ సేవ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు:**

మీ సేవ కేంద్రాల ద్వారా అందిన కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులపై నిర్ణయం తీసుకొని ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలని, రెవెన్యూ సేవల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, నూతనంగా నియమితులైన భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరి, భూమి రికార్డులు, సర్వే విభాగం ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి సందర్భంగా భజరంగ్ దళ్ యువత సేవా కార్యక్రమం

## దుర్గామాత మండపాల వద్ద భక్తుల దాహార్తి తీర్చేందుకు చల్లని తాగునీటి ఏర్పాటు

## సల్కార్‌పేట్‌తో పాటు పలు గ్రామాల్లో భజరంగ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో సేవలు



**గండీడ్, (ప్రజా జ్యోతి):**

విజయదశమి పండుగను పురస్కరించుకుని భజరంగ్ దళ్ యూత్ సభ్యులు సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పండుగ సందర్భంగా దుర్గామాత మండపాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మండపాల ఆవరణలో చల్లని తాగునీటిని అందుబాటులో ఏర్పాటు చేశారు.భజరంగ్ దళ్ యూత్ సల్కార్‌పేట్ యువకులు సమష్టిగా ముందుకు వచ్చి భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సమయంలో అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో వారికి తాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఎండ, రద్దీ కారణంగా ఇబ్బందులు పడే భక్తులకు చల్లని నీటిని అందించడం ద్వారా యువత తమ సేవాభావాన్ని చాటుకున్నారు.సల్కార్‌పేట్‌తో పాటు రంగారెడ్డిపల్లి, రెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి తదితర గ్రామాల్లోని దుర్గామాత మండపాల వద్ద కూడా తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పండుగలు, ఉత్సవాల సమయంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం యువత సామాజిక బాధ్యతకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా భజరంగ్ దళ్ యూత్ సభ్యులు చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# పోలీసుల సేవలు.. అమరవీరుల త్యాగాలు!

## – పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు

## – అక్టోబర్ 23లోగా చిత్రాలు సమర్పించాలి.. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు

## – జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రకటన

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 (ప్రజా జ్యోతి బ్యూరో):**

సమాజ రక్షణలో పోలీసుల పాత్రను, విధి నిర్వహణలో అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీస్ ఫ్లాగ్ డే (అమరవీరుల స్మారక వారోత్సవాలు) సందర్భంగా మూడు నిమిషాల లఘుచిత్రాల (షార్ట్ ఫిల్మ్), ఫోటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ దరావత్ జానకి వెల్లడించారు. పోలీసుల సేవలు, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు, సమాజ భద్రత కోసం వారు చేస్తున్న కృషిని సృజనాత్మకంగా ఆవిష్కరించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, యువత, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### పోలీసుల సేవలే కథాంశంగా.. సృజనాత్మకతకు పదును!

పోలీసు శాఖ విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పోలీసు--ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, అమరవీరుల త్యాగాలు, మహిళలు, పిల్లల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత, నేరాల నియంత్రణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను ఇతివృత్తాలుగా ఎంచుకోవచ్చని ఎస్పీ తెలిపారు.పోలీసుల విధి నిర్వహణలోని సవాళ్లు, ప్రజల రక్షణ కోసం వారు చేస్తున్న కృషి, సమాజంలో భద్రతపై అవగాహన పెంచే అంశాలను ప్రతిబింబించేలా లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలు రూపొందించాలని సూచించారు.

### షార్ట్ ఫిల్మ్ మూడు నిమిషాలకు మించకూడదు

లఘుచిత్రం గరిష్టంగా మూడు నిమిషాల నిడివి కలిగి ఉండాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఫోటోగ్రఫీ పోటీలకు ఇటీవల తీసిన, పోలీసు శాఖకు సంబంధించిన అంశాలను ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలను సమర్పించాలి.పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తమ లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలను 2026 అక్టోబర్ 23వ తేదీలోగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఐటీ సెల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవికి అందజేయాలి.సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8712659298

### జిల్లా స్థాయిలో విజేతలకు బహుమతులు

జిల్లా స్థాయిలో న్యాయనిర్ణేతల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు లఘుచిత్రాలు, మూడు ఉత్తమ ఛాయాచిత్రాలను ఎంపిక చేయనున్నారు. విజేతలకు జిల్లా ఎస్పీ జానకి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన మొదటి మూడు లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

### కెమెరా కంటితో పోలీసుల త్యాగాలకు అక్షరరూపం.!

పోలీసుల సేవలు, అమరవీరుల త్యాగాలు కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా సమాజానికి స్ఫూర్తినిచ్చే అంశాలని ఎస్పీ పేర్కొన్నారు. సృజనాత్మక చిత్రాల ద్వారా పోలీసుల సేవలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, భద్రతపై సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, యువత తమ సృజనాత్మక ప్రతిభను చాటుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ జానకి కోరారు.

